క్లుప్తంగా

స్పందనలో నాలుగు అర్జీలు

గంపలగూడెం: గంపలగూడెం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో నాలుగు అర్జీలు వచ్చినట్లు ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి తెలిపారు., గంపలగూడెంకు చెందిన కోట నాగమ్మ తన పొలం అక్రమణలో ఉన్నదని తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. చెన్నవరానికి చెందిన ఇ.రామారావు నిబంధనలకు వ్యతిరేకంగా గ్రామంలో చర్చి నిర్మాణం చేస్తున్నారంటూ ఫిర్యాదు చేశారు. అనుముల్లంకలో మురుగు కాలవల్లో పూడిక తొలగించి నీరు సక్రమంగా పారేలా చర్యలు తీసుకోవాలంటూ కె.గోపాలస్వామి దరఖాస్తులు ఇచ్చారు. రైతు భరోసా నగదు తనకు జమ కాలేదంటూ గంపలగూడెంకు చెందిన కోట కోటేశ్వరరావు అర్జీ ఇచ్చారు. తహసీల్దార్ జి.బాలకృష్ణారెడ్డి, గృహ నిర్మాణశాఖ ఏఈ కిషోర్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

మైలవరంలో...

మైలవరం: మైలవరం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి ప్రజల నుంచి నాలుగు అర్జీలు అందినట్లు ఎంపీడీఓ లక్ష్మీకుమారి తెలిపారు. పట్టాదారు పాస్ పుస్తకం మంజూరు చేయాలని ఇద్దరు, తన భూమికి సరిహద్దులు నిర్ణయించి భూమి కొలతలు వేయాలని కోరుతూ ఒకటి, ఇళ్ల స్థలం కేటాయించాలని అర్జీలు అందాయన్నారు.

ఆరోగ్య సమస్యలుంటే ఆసుపత్రికి రండి

రోలుపడి(తిరువూరు): జలుబు, దగ్గు, జ్వరం ఎక్కువ రోజులు ఉన్నా, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు పడుతున్నా ఆసుపత్రిలో వైద్యపరీక్షలు చేయించుకోవాలని మండలంలోని రోలుపడి గ్రామంలో ఆరోగ్య సిబ్బంది సోమవారం ప్రజలకు అవగాహన కల్పించారు. హెచ్3ఎన్2 ఇన్ఫ్లుయెంజా వైరస్ బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, బహిరంగ ప్రదేశాల్లో మాస్కు ధరించాలని సూచించారు.

పరీక్షకు మాస్కులు ధరించి రావాలి

మైలవరం: కృష్ణా యూనివర్సిటీ మొదటి సెమిస్టర్, ఐదవ సెమిస్టర్, రెగ్యులర్ అండ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 15వ తేదీ బుధవారం నుంచి జరుగనున్నాయి. ఈ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు తప్పనిసరిగా మాస్కులు ధరించి, శానిటైజర్‌తో సహా హాజరు కావాల్సిందిగా మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ళ రవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

స్త్రీ నిధి రుణాలు మంజూరు చేయండి



ఆగిరిపల్లి: అర్హులైన డ్వాక్రా గ్రూపు సభ్యులకు స్త్రీ నిధి రుణాలు మంజూరయ్యేలా వీఓఏలు చూడాలని ఏలూరు జిల్లా స్త్రీ నిధి ఏజీఎం పి.శశికుమార్ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం స్త్రీనిధి రుణాలపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన స్త్రీ నిధి ఏజీఎం శశికుమార్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ నెలాఖరులోగా స్త్రీ నిధి రుణాలు మంజూరు చేయాలన్నారు. రికవరీ సాధించిన వీఓఏలను ఆయన అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి సెక్షన్ పరిధిలోని 11 కేవీ సూరాయిపాలెం ఫీడర్ లైన్ల మరమ్మతులలో భాగంగా కొన్ని ప్రాంతాలలో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. మంగళవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు పోస్ట్ ఆఫీస్ రోడ్, వాటర్ ఫిల్టర్ బెడ్ ఏరియా వరకు కరెంట్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఆయన వివరించారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నేడు ఆల్బెండాజోల్ మాత్రల పంపిణీ

ఇబ్రహీంపట్నం:జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని గ్రామాలు, కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పాఠశాలల్లో మంగళవారం ఆల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు పీహెచ్‌సీ వైద్యురాలు సుధా ప్రసూజ, యూపీహెచ్‌సీ వైద్యాధికారి శ్రావ్యపూర్ణిమ తెలిపారు.

విస్సన్నపేట: మండలంలో మంగళవారం నులి పురుగు నివారణ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు వైద్యాధికారి విజయలక్ష్మి తెలిపారు. మండలంలో 14,426 మందికి నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ చేయటానికి మాత్రలు సిద్ధం చేశామన్నారు.

గంపలగూడెం: గంపలగూడెం మండలంలో మంగళవారం 19 ఏళ్ల లోపు పిల్లలకు నులి పురుగు నివారణ మాత్రలు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు గంపలగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కె.శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని ఊటుకూరు, గంపలగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 12,500 మందికి ఈ మాత్రల పంపిణీ చేయాలని నిర్ధారించామన్నారు. ఒకటి నుంచి రెండు సంవత్సరాల లోపు పిల్లలకు 200 ఎంజీ, అంతకు పైబడిన పిల్లలకు 400 ఎంజీ మాత్రలు మధ్యాహ్నం భోజనం చేసిన అరగంట తర్వాత వేయాలన్నారు. ఏదైనా కారణంతో మాత్రలు తీసుకోని వారికి ఈనెల 18వ తేదీన రెండవ విడత పంపిణీ చేస్తామన్నారు.

నకిలీ విత్తనాలకు చెక్

వైఎస్సార్ టెస్టింగ్ ల్యాబ్‌లో విత్తనాలు, ఎరువుల పరీక్ష

ఎ.కొండూరు: అన్నదాతలు నకిలీ విత్తనాలతో మోసపోకుండా వైఎస్సార్ టెస్టింగ్ ల్యాబ్ భరోసా కల్పిస్తుంది. వైఎస్సార్ ప్రభుత్వంలో రైతులకు సేవలు మరింత చేరువ చేసేందుకు రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. రైతులకు మేలైన విత్తనాలు అందాలనే ఉద్దేశంతో వ్యవసాయాన్ని మరింత ప్రోత్సహించి అధిక దిగుబడులు సాధించేందుకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను పరీక్షించేందుకు డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్‌ల్యాబ్ ఎంతో ఉపయోగపడుతుంది. ఈ ల్యాబ్‌ను నియోజకవర్గ స్థాయిలో ఎ.కొండూరులో ఏర్పాటు చేశారు. గంపలగూడెం, విస్సన్నపేట, తిరువూరు మండలాల రైతులందరూ ఈ సేవలు పొందవచ్చు. రైతులు పరీక్షల కోసం తీసుకువచ్చిన విత్తనాలను, ఎరువులను ప్రత్యేకంగా క్వాలిటీ కంట్రోల్ యాప్ అభివృద్ధి చేశారు, ల్యాబ్‌లో పరీక్షించిన ఫలితాలను తారుమారు చేయటానికి వీలు లేకుండా లేబొరేటరీలో ఆటోమిషన్ ఏర్పాటు చేశారు. టెస్టింగ్ చేసినవి అన్నీ రికార్డు కావడంతో పాటు వాటంతటవే సిస్టమ్‌లో నమోదవుతాయి. రైతులు షాపులకు వెళ్లినప్పుడు బ్యాచ్ నంబర్ చెక్ చేసుకుంటే చాలు. నాణ్యత సర్టిఫికెట్ ఉందో లేదో తెలిసిపోతుంది. రైతులు తమ సొంత విత్తనాల నాణ్యతను కూడా ఈ ల్యాబ్‌లో ఉచితంగా పరీక్షించుకోవచ్చు. విత్తనాల శాంపిళ్లు ల్యాబ్‌లో అందజేస్తే వాటిని పరీక్షించి నాణ్యతను నిర్ధారిస్తారు. విత్తనాలు, పురుగు మందుల కంపెనీలు అడ్డదారులు తొక్కకుండా ఇలాంటి ఏర్పాట్లు చేశారు. రైతులు ఈ ల్యాబ్‌ను సద్వినియోగం చేసుకుంటే ఎంతో ప్రయోజనం ఉంటుంది.



ఎ.కొండూరులో ఏర్పాటు చేసిన వైఎస్సార్ అగ్రి ల్యాబ్



ల్యాబ్‌లో పరీక్షలు చేస్తున్న అధికారులు

ఎరువులు, విత్తనాలు ఉచితంగా పరీక్ష చేయించుకోవచ్చు



రైతులు నకిలీ విత్తనాలు నాటి మోసపోకుండా ఈ ల్యాబ్ ఎంతో ఉపయోగపడుతుంది.ఇప్పటివరకు విత్తనాలు 172 నమునాలు, ఎరువులు 88 నమునాలను పరీక్షలు చేశాం. వరి విత్తనాల పరీక్షలకు ఇద్దరు రైతులు శాంపిల్స్ తీసుకువచ్చి పరీక్షలు చేయించుకోగా మొలకశాతం 88–86శాతం వచ్చినట్లు పరీక్షల్లో నిర్ధారించారు. ఇలాంటి విత్తనాలు సాగు చేసుకోవడం వల్ల అధిక దిగుబడులు సాధించుకోవచ్చు. ఎరువులు, విత్తనాలను ఉచితంగా పరీక్షలు చేయించుకోవచ్చు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

–కె.వెంకటేశ్వరరావు, ల్యాబ్ ఏఓ

బీరప్ప కొలుపులకు తరలివచ్చిన భక్తులు

చాట్రాయి: మండలంలోని చనుబండ గ్రామంలో ఉన్న కురుమల ఆరాధ్య దేవుళ్లు బీరప్ప, కామరాతి స్వామివార్ల కొలుపుల సందర్భంగా సోమవారం వందలాది మంది మహిళలు బోనాలు సమర్పించారు. గ్రామంలోని కురుమ సామాజిక వర్గానికి చెందిన సుమారు 800 కుటుంబాల్లోని మహిళలు తలపై బోనాలు పెట్టుకుని సన్నాయి మేళతాళాలతో స్వామి ఆలయానికి తరలివచ్చారు. ఆలయం వద్ద వరంగల్‌కి చెందిన పూజారికి ఘణం రావడంతో బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి బోనాలు సమర్పించారు. మండపంపై ఒగ్గు కథకులు బీరప్ప స్వామి జీవిత చరిత్రను ప్రదర్శించారు. బలిహరణ చేసిన అనంతరం ఎవరి ఇంట్లో వారు వంటలు చేసుకుని బంధువులు, మిత్రులతో భోజనాలు చేశారు. అనంతరం బీరప్ప కామరాతిల కల్యాణం ఘనంగా నిర్వహించారు.



బీరప్ప స్వామికి బోనాలు సమర్పిస్తున్న భక్తులు

ముగిసిన పద్దమ్మ తల్లి తిరునాళ్ల

రెడ్డిగూడెం: రెడ్డిగూడెం శివారు రాఘవాపురం గ్రామంలో ఉన్న శ్రీ సత్తిరెడ్డి సమేత పద్దమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవాలు ఆదివారం రాత్రితో ముగిశాయి. ఐదు రోజుల పాటు జరిగిన ఈ తిరునాళ్ల మహోత్సవం అంగరంగవైభవంగా అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో మొత్తం విద్యుత్ దీపాలంకరణలతో ప్రత్యేక శోభ సంతరించుకుంది. ఆఖరి రోజైన ఆదివారం రాత్రి రెడ్డిగూడెం, రాఘవాపురం కొత్తరెడ్డిగూడెం, రంగాపురం, బూరుగగూడెం, తాడిగూడెం గ్రామాల నుంచే కాక ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం మొత్తం భక్తులతో కిటకిటలాడింది. కోలాటాలు, సంగీత కచేరీలతో సందడి నెలకొంది. సిడిమాను కార్యక్రమంతో తిరునాళ్ల మహోత్సవం ముగిసింది. రెడ్డిగూడెం ఎస్ఐ డి.ఆనంద్‌కుమార్ తన సిబ్బందితో శాంతిభద్రతలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు.



పద్దమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

సకల వసతులతో సుందరంగా పల్లె సీమలు

నూజివీడు ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు

ముసునూరు: జగనన్న పాలనలో కార్యాలయాలు, పక్కా రహదారులతో పల్లె సీమల్లో అన్ని సౌకర్యాలు వచ్చాయని నూజివీడు ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని కొర్లగుంట, ముసునూరు, కాట్రేనిపాడు, గోపవరం, బలివే, వలసపల్లి, చెక్కపల్లి, లోపూడి గ్రామాల్లో సోమవారం పలు అభివృద్ధి పనులకు ఎంపీ కోటగిరి శ్రీధర్, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావుతో కలసి ఆయన భూమి పూజలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఎంపీడీఓ జి.రాణి, పంచాయతీ రాజ్ ఏఈ నరసింహారావు ఆధ్వర్యంలో కొర్లగుంటలో రూ.15 లక్షల ఎంపీ నిధులతో బహుళ ప్రజోపయోగ భవనం, రూ.14 లక్షలతో ముసునూరులో అసంపూర్తిగా ఉన్న వ్యవసాయ శాఖాధికారి కార్యాలయం పూర్తి, రూ.40 లక్షలతో సచివాలయం–2, కాట్రేనిపాడులో రూ.21.8 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రహదారికి కల్వర్టు, గోపవరంలో వ్యవసాయ సొసైటీలో లాకర్లు, బలివేలో రూ.40 లక్షలతో నిర్మితమైన సచివాలయ భవనం, వలసపల్లి ఎస్సీ ఏరియాలో రూ.15 లక్షలతో సామాజిక భవనం, చెక్కపల్లిలో రూ.25 లక్షలతో సచివాలయం (టైప్–2), లోపూడిలో రూ.17.67 లక్షలతో బల్క్ మిల్క్ సెంటర్, రూ.16 లక్షలతో డిజిటల్ లైబ్రరీ నిర్మాణ పనులు, ఎంపీ నిధులు రూ.10 లక్షలతో శ్మశానవాటిక అభివృద్ధి పనులు, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి ఎంపీ నిధులు రూ.15.70 లక్షలతో బహుళ ప్రజోపయోగ భవన నిర్మాణాలకు భూమి పూజలు ప్రారంభోత్సవాలు చేశారు. సభకు ఎంపీపీ రావర్ల కృష్ణకుమారి అధ్యక్షత వహించారు. కార్యక్రమాల్లో కో–ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, జెడ్పీటీసీ వరికూటి ప్రతాప్, స్టేట్ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ పి.స్వరూపరాణి, వైస్ ఎంపీపీలు కె.రాజానాయన, పి.గంగాధరరావు,, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మూల్పూరి నాగమల్లేశ్వరరావు, తహసీల్దార్ డి.సుధ, సర్పంచ్‌లు, వ్యవసాయ సొసైటీల అధ్యక్షులు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలు గ్రామాల పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.



కొర్లగుంటలో బహుళ ప్రయోజక భవన నిర్మాణ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మేకా ప్రతాప్

కేడీసీసీని ప్రథమ స్థానంలో నిలుపుదాం

ముసునూరు: జగనన్న ప్రోత్సాహం, ప్రజలందరి సహకారంతో కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంకును దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానని కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని గోపవరంలో సోమవారం జరిగిన సహకార లాకర్ల ప్రారంభోత్సవం, రుణాల చెక్కుల పంపిణీ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మేకా ప్రతాప్, ఎంపీ కోటగిరి శ్రీధర్‌లతో కలసి ఆయన పాల్గొన్నారు. సొసైటీ అధ్యక్షుడు కోటగిరి గోపాలకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ కేడీసీసీ బ్యాంకును రూ.800 కోట్ల టర్నోవర్‌తో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిపామన్నారు. గోపవరం సొసైటీలో రైతుల కోరికపై స్ట్రాంగ్ రూమ్, క్యాష్ కౌంటర్లు, లాకర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం రైతులకు రూ.2 కోట్ల దీర్ఘకాలిక, రూ.కోటి పంట రుణాల చెక్కులను పంపిణీ చేశారు. రూ.20 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రూ.30 లక్షల సేవింగ్స్ తొలిరోజు నమోదైనట్లు సీఈఓ వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో కోఆపరేటివ్ యూనియన్ స్టేట్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, హిస్టరీ అకాడమీ డైరెక్టర్ స్వరూపరాణి, జెడ్పీటీసీ వి.ప్రతాప్, ఎంపీపీ ఆర్.కృష్ణకుమారి, వైస్ ఎంపీపీలు రాజానాయన, గంగాధర్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

గోసవీడు(గంపలగూడెం): వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని మాదిగ ఉద్యోగుల సంఘం జాతీయ కోశాధికారి డి.సుబ్బారావు అన్నారు. వర్గీకరణ సాధనలో భాగంగా గంపలగూడెం మండలం గోసవీడు నుంచి విజయవాడ వరకు చేపట్టిన మహా సంగ్రామ పాదయాత్ర ఆయన సోమవారం జెండా ఊపి ప్రారంభించారు. ఎమ్మార్పీఎస్ ఎన్టీఆర్ జిల్లా కోకన్వీనర్ ఎ.నాగమల్లేశ్వరరావు, తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఎస్.మైఖేల్ పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తులు

కుంటముక్కల(ఏకొండూరు): కుంటముక్కల సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో 2023–24 వ సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపల్ కె.విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో చేరే విద్యార్థులు ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 4వ తరగతి చదివి ఉండాలని, ఇంటర్ ప్రథమ ఏడాది బైపీసీ, ఎంపీసీలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 24వ తేదీ లోపు apgpcet.apc--fss.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, 5వ తరగతి ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 23న ఉదయం, ఇంటర్ ప్రవేశ పరీక్ష అదేరోజు మధ్యాహ్నం జరుగుతుందన్నారు. వివరాలకు 97045 50059 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

కిచెన్ గార్డెన్‌లో మునగాకు పెంచాలి

తిరువూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, చిన్నపిల్లల మెనూలో ప్రభుత్వం మార్పు చేసినట్లు తిరువూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి సత్యవతి తెలిపారు. రక్తహీనత కలిగిన వారికి మునగాకుతో చేసిన ఆహారపదార్థాలు అందజేయాలని ప్రభుత్వం ఆదేశించినందున తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు మండలాల్లోని 193 అంగన్‌వాడీ కేంద్రాల్లో మునగచెట్లు పెంచాలని నిర్ణయించినట్లు తెలిపారు. బచ్చలి తదితర ఆకుకూరల్లో ఇనుప ధాతు పోషకాలు సమృద్ధిగా ఉన్నందున గర్భిణులు, బాలింతలకు ఈ ఆహారపదార్థాలపై అవగాహన కల్పించాలని కార్యకర్తలను ఆదేశించామన్నారు.

దేవస్థాన భూమి స్వాధీనానికి వినతి

గంపలగూడెం: విజయవాడ బ్రాహ్మణ వీధిలో ఉన్న శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంకు చెందిన గంపలగూడెం మండలంలో ఉన్న 14.34 ఎకరాల భూమిని సర్వే చేసి స్వాధీనపరచాలంటూ తిరువూరు ఆలయ గ్రూపు మేనేజర్ జె.వెంకటేశ్వరరావు, గంపలగూడెం తహసీల్దార్ బాలకృష్ణారెడ్డికి సోమవారం అర్జీ అందజేశారు గంపలగూడెం మండలం వినగడపలో ఆర్ఎస్ నంబర్ 111/1, 132లలో రికార్డుల ప్రకారం దేవస్థానంకు చెందిన భూమి ఉందని ఆ దరఖాస్తులో పేర్కొన్నారు. జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష పథకంలో నిర్వహిస్తున్న భూ రీ సర్వేలో సర్వే చేసి దేవస్థానానికి అప్పగించాలన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోండి

ఇబ్రహీంపట్నం: క్రైస్తవ సంఘాలకు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ రకాల పథకాలు సద్వినియోగం చేసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా క్రిస్టియన్ మైనార్టీ చైర్మన్ దయానందం అన్నారు. ఇబ్రహీంపట్నం మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం చర్చిలు, శ్మశానవాటికలు, కమ్యూనిటీ భవన నిర్మాణాలకు అందిస్తున్న ప్రోత్సాహకాలను వివరించారు. అనంతరం పాస్టర్స్ సంఘం అధ్యక్షుడు మైలమాల శ్యామ్‌సుందర్ అధ్యక్షతన ఆయన్ను ఘనంగా సత్కరించారు. పాస్టర్లను దయానందం సన్మానించారు. కార్యక్రమంలో పాస్టర్స్ ఫెలోషిప్ ఉపాధ్యక్షుడు ఇస్మాయేలు, కార్యదర్శి ఇమ్మానియేలు, జాయింట్ సెక్రటరీ అబ్రహం, ట్రెజరర్ యదిద్య పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు

నూజివీడు: స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిష్కరించడంలో ఎలాంటి అలసత్వం వద్దని సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి వివిధ సమస్యలపై 8 అర్జీలు అందాయి. వీటిలో ఎక్కువగా రెవెన్యూశాఖ, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలకు సంబంధించినవే ఉన్నాయి. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ స్పందన అర్జీలను గడువులోగా పరిష్కరించాలన్నారు. స్పందనను ప్రతి వార్డు, గ్రామ సచివాలయాల్లో ప్రతిరోజూ సాయంత్రం 3గంటల నుంచి 5గంటల వరకు నిర్వహిస్తున్నారని, అక్కడ కూడా ప్రజలు తమ సమస్యలపై అర్జీలను అందజేయవచ్చన్నారు.



స్పందన అర్జీలు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

సంక్షిప్తం

డ్రైనేజీ నిర్మించి మురుగు సమస్య తొలగించండి

ఇబ్రహీంపట్నం: స్థానిక ఆర్టీసీ డిపో పక్కన ప్రసాద్ నగర్‌కు వెళ్లేదారిలో మురుగునీటి సమస్య పరిష్కారానికి డ్రైనేజీ నిర్మించాలని ఎహెచ్ ఏ 1 స్థలం ఇన్‌చార్జ్ నూరుద్దీన్‌కు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో హైవే అధికారులతో మురుగునీటి సమస్యలపై సోమవారం సమీక్ష జరిపారు. జాతీయ రహదారి స్థలం అభివృద్ధిలో బాగంగా మెరక పనులు చేయడం వలన ఆప్రాంతంలో మురుగు నీటి నిల్వలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. స్థలం మధ్యలో మేజర్ డ్రైనేజీ నిర్మించి మురుగునీటి సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. అనంతరం జగనన్న ఇళ్ల నిర్మాణంపై సచివాలయ ఉద్యోగులతో చర్చించారు. ఉగాది నాటికి ఎట్టి పరిస్థితుల్లో నిర్మాణాలు పూర్తికావాలన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు

ఎ.కొండూరు: విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని నూజివీడు ఈఈ కృష్ణానాయక్ అన్నారు. ఎ.కొండూరు మండలంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం విజిలెన్స్ దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ ఈఈ వెంకటేశ్వర్లు, నూజివీడు ఈఈ కృష్ణానాయక్ మాట్లాడుతూ మండలంలో 46 బృందాలుగా ఏర్పడి విజిలెన్స్ దాడులు నిర్వహించామని, 2370 గృహాల సర్వీసులు, 256 వాణిజ్య సముదాయాల సర్వీసులను తనిఖీ చేసి వాటిలో 118 సర్వీసులకు అదనపు లోడు విద్యుత్ వాడుతుండటంతో రూ.3,32,600 జరిమానా విధించినట్లు చెప్పారు. మీటర్లు ఉన్నప్పటికీ విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ఇద్దరు వినియోగదారులను గుర్తించి రూ.10 వేలు జరిమానా విధించామని, 8 మంది వినియోగదారులు మీటరు లేకుండా డైరెక్ట్‌గా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నారని, వారికి రూ.41 వేలు, విద్యుత్ క్యాటగిరీ కాకుండా వేరే క్యాటగిరిలో వాడుతున్న ముగ్గురు వినియోగదారులకు రూ.7వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. మండలంలో ఎక్కడైనా విద్యుత్ చౌర్యానికి పాల్పడితే తమకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో తిరువూరు, నూజివీడు, విస్సన్నపేట ఏడీలు పి. రామకృష్ణ, కె.నారాయణ, ఎం.పోతురాజు విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్, లైన్‌మెన్లు పాల్గొన్నారు.

నాట్యంలో ఎల్‌బీఆర్‌సీఈ విద్యార్థినుల ప్రతిభ

మైలవరం: జాతీయ సమైక్యతా శిబిరంలో మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థినులు భరతనాట్యం, జాతీయ నృత్యంలో ప్రతిభ కనబర్చి ప్రశంసా పత్రాలు పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు తెలిపారు. స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం జరిగిన సమావేశంలో ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు మాట్లాడుతూ నేస్తం జాతీయ యువజన క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 3 నుంచి 9వ తేదీ వరకు నర్సాపురంలోని శ్రీఎర్రమిల్లి నారాయణమూర్తి కళాశాలలో జాతీయ సమైక్యతా శిబిరం నిర్వహించారన్నారు. ఈ శిబిరంలో దేశంలోని 12 రాష్ట్రాల నుంచి 200 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్‌లు పాల్గొన్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించిన జేఎన్‌టీయూకే, కాకినాడ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం నుంచి నలుగురు విద్యార్థినులు పాల్గొనగా వారిలో తమ కళాశాల విద్యార్థినులు పెద్దిబోయిన హేమ హారిణి, తోడేటి నిఖితశ్రీ భరతనాట్యం, జాతీయ నృత్యంలో ప్రతిభ కనబర్చి ప్రశంసలు పొందారన్నారు. ఈ సందర్భంగా సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో కళాశాల ప్రెసిడెంట్ జి. శ్రీనివాసరెడ్డి విద్యార్థినులకు అభినందనలు తెలిపారు.

సారా విక్రేత అరెస్టు

ఆగిరిపల్లి: మండలంలోని ఈదులగూడెంలో సారా విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఎన్.చంటిబాబు సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన వీరంకి తిరపతమ్మ సారా అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో ఆమెను అదుపులోకి తీసుకుని ఆమె వద్ద ఉన్న 5 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

మామిడి తోటల్లో తామర పురుగు ఉధృతి

నూజివీడు: మండలంలోని మామిడి తోటలు పిందెలు, కాయల దశలో ఉన్నాయని, అయితే తామర పురుగులు ఉధృతంగా ఉన్నందున కాయలపై రాగి మచ్చలు ఏర్పడే అవకాశం ఉందని ఉద్యానవన సహాయ సంచాలకురాలు జె.శాంతి హెచ్చరించారు. మండలంలోని బోర్వంచలో సోమవారం మామిడి తోటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. తామర పురుగు నివారణకు ఫిప్రోనిల్ 2 ఎంఎల్ లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.5 ఎంఎల్ లేదా థయామిథాక్సామ్ 0.3గ్రా లేదా డై మిథోయేట్ 2 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు.

4,716 ఎకరాల్లో ఈ–క్రాప్ బుకింగ్

నూజివీడు: మండలంలో రబీ సీజన్‌లో 4,716 ఎకరాల్లో ఈ– క్రాప్ బుకింగ్ పూర్తయినట్లు వ్యవసాయాధికారి ఆలూరు చాముండేశ్వరి సోమవారం తెలిపారు. మొత్తం 2,222 మంది రైతులకు సంబంధించి ఈకేవైసీ పూర్తి చేశామని చెప్పారు. ఈ క్రాప్ బుకింగ్ ముసాయిదా జాబితాను మండలంలోని అన్ని రైతుభరోసా కేంద్రాల్లో ప్రదర్శించామన్నారు. జాబితాలపై గ్రామసభలను ఈనెల 17 వరకు నిర్వహిస్తామన్నారు. ఏవైనా అభ్యంతరాలుంటే రైతులు రాతపూర్వకంగా రైతుభరోసా కేంద్రం సిబ్బందికి తెలపాలన్నారు.

మామిడి చెట్ల ఫలసాయం విక్రయానికి వేలం

నూజివీడు: పట్టణంలోని మామిడి పరిశోధనస్థానం ఆవరణలో ఉన్న 500 మామిడి చెట్ల ఫలసాయాన్ని వేలం ద్వారా విక్రయించేందుకు ఈనెల 14న ఉదయం 11 గంటలకు కార్యాలయ ఆవరణలో వేలం నిర్వహిస్తున్నట్లు పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త బీకేడీ లక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు రూ.10 వేలు ఉదయం 10 గంటల లోపు చెల్లించాలన్నారు. వేలంలో దక్కించుకున్న పాటదారుడు ఈనెల 18 లోపు మిగిలిన సొమ్మును చెల్లించి రసీదు పొందాలన్నారు. మొత్తం సొమ్మును చెల్లించిన తరువాతే కాయలు కోసేందుకు అనుమతినిస్తామని పేర్కొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుకు సహకరించాలి

నూజివీడు: పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు, ప్లాస్టిక్ వాడకం పూర్తిగా తగ్గించేందుకు ప్రజలందరూ సహకరించాలని సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ కోరారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు పారిశుద్ధ్యం, ప్లాస్టిక్ నిషేధంపై సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్, మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణలతో కలిసి ప్రతి దుకాణం వద్దకు వెళ్లి దుకాణాల్లోని చెత్తాచెదారం రోడ్డుపైన గాని, డ్రైనేజీలో గాని వేయడానికి వీల్లేదని, దుకాణం వద్ద డస్ట్‌బిన్ ఏర్పాటు చేసుకుని అందులో వేస్తే మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు చెత్తను తీసుకెళ్తారని చెప్పారు. డ్రైనేజీలపై ఆక్రమణలను సైతం ఎవరికి వారు స్వచ్ఛందంగా తీసేయాలని, లేని పక్షంలో మున్సిపల్ సిబ్బంది వచ్చి తొలగించాల్సి వస్తుందన్నారు. దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లను విక్రయించవద్దని, విక్రయిస్తే జరిమానా విధిస్తామన్నారు.

ఆర్బీకేలలో ఈ–క్రాప్ నమోదు జాబితాలు

తిరువూరు: రబీ సీజన్లో పంటలు వేసి ఈ–క్రాప్‌లో నమోదు చేయించుకున్న రైతుల వివరాలను అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శిస్తామని మండల వ్యవసాయాధికారి పద్మ తెలిపారు. ఈ జాబితాల్లో ఏవైనా తప్పులుంటే రైతులు తమ పరిధిలోని ఆర్బీకేలో తెలియజేయాలని సూచించారు.

కామ్రేడ్ అరుణ సంతాప సభ

ఇబ్రహీంపట్నం: పేదల సమస్యలపై నిరంతరం పోరాటం చేసి ఇటీవల మృతి చెందిన కామ్రేడ్ రొంగల అరుణ సంతాపసభ ఇబ్రహీంపట్నం ఎంసీపీఐయూ కార్యాలయంలో సోమవారం జరిగింది. కార్యక్రమంలో ఎంసీపీఐయూ ఉమ్మడి కృష్ణాజిల్లా కార్యదర్శి గొల్లపూడి ప్రసాద్ పాల్గొని ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు.

టిడ్కో ఇళ్లు త్వరగా పూర్తిచేయాలి

తిరువూరు: తిరువూరు శివారు పీటీ కొత్తూరులో పేదలకు మంజూరు చేసిన టిడ్కో ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని సీపీఐ నాయకులు సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో వినతిపత్రం సమర్పించారు. జగనన్న కాలనీ ఇళ్లకు నిర్మాణ వ్యయం పెరిగినందున అదనపు నిధులు మంజూరు చేయాలని కోరారు.

